క్లుప్తంగా

పీహెచ్‌సీకి కొత్త శోభ



పీహెచ్‌సీ ముందు భాగంలో బొమ్మలు వేసిన దృశ్యం

కూడేరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాని(పీహెచ్‌సీ)కి కొత్త శోభ వచ్చింది. ఇంతకు ముందు ప్రభుత్వం నాడు–నేడు పథకం కింద ఆస్పత్రిని అభివృద్ధి చేసింది. రోగులు, సిబ్బందికి మౌలిక వసతులను ఏర్పాటు చేసింది. తాజాగా పీహెచ్‌సీ ముందు భాగమంతా బిడ్డకు తల్లి పాలివ్వడం, 108 వాహనం, సిరంజిలు, బెడ్‌పై రోగికి సెలెన్ ఎక్కించే, స్కెతస్కోప్, టాబ్లెట్లు ఇతర బొమ్మలను పలు రకాల రంగులతో వేశారు. ఆ బొమ్మలతో పీహెచ్‌సీ ఆకర్షణీయంగా కనిపిస్తోంది.

పంచ లోహ విగ్రహం వితరణ



ఊరేగింపుగా పంచలోహ గణపతి విగ్రహాన్ని తీసుకువస్తున్న భక్తులు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని విఘ్నేశ్వర స్వామి ఆలయానికి గ్రామస్తులు, సేవాకమిటీ సభ్యులు కలసి పంచలోహ గణపతి విగ్రహాన్ని వితరణ చేశారు. గురువారం స్థానిక మంజునాథస్వామి ఆలయం నుంచి పంచలోహ విగ్రహాన్ని ఊరేగింపుగా భజనలు చేస్తూ విఘ్నేశ్వరస్వామి ఆలయానికి తీసుకువచ్చి పండితుడు రాంబాబుశాస్త్రితో కలసి అందజేశారు. సుమారు 30 కిలోల విగ్రహాన్ని పంచ లోహాలతో కర్ణాటకలోని తిప్పేస్వామి పుణ్యక్షేత్రం నాయకనహట్టిలో తయారు చేయించామని సేవాకమిటీ సభ్యులు తెలిపారు.

మేజర్ పంచాయతీ ఆధ్వర్యంలో చాదర్ సమర్పణ



అమ్మవారి జీవసమాధి వద్ద చాదర్‌ను సమర్పించి ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: పట్టణంలోని హజరత్ బీబీ జైనబ్బీ అమ్మవారికి శుక్రవారం భారీ ఊరేగింపుతో మేజర్ గ్రామ పంచాయతీ తరఫున చాదర్ సమర్పించారు. స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయం నుంచి సర్పంచ్ లలితమ్మ, ఉప సర్పంచ్ వన్నప్ప, ఈఓ గౌస్ సాహెబ్, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో మేళతాళాలతో ఊరేగింపుగా దర్గాకు చాదర్‌ను తీసుకొచ్చారు. అనంతరం అమ్మవారి జీవసమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే జైనబ్బీ అమ్మవారి దర్గా అభివృద్ధికి రూ.10 వేల నగదును ఉపసర్పంచ్ వన్నప్ప దర్గాకమిటీకి అందించారు. వైస్ ఎంపీపీ నరసింహులు, జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య, ఈఓ గౌస్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

మీ సేవా కేంద్రాల తనిఖీ



మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారి, డీఎల్‌డీఓ శంకర్

కళ్యాణదుర్గం: పట్టణంలోని పలు మీ సేవా కేంద్రాలను విజిలెన్స్ అధికారి, డీఎల్‌డీఓ శంకర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మీ సేవా కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ, వినియోగదారుల వద్ద నుంచి తీసుకుంటున్న రుసుం, అందిస్తున్న సేవలు తదితర వాటిపై ఆరా తీశారు. కాగా తనిఖీల్లో పలు కేంద్రాల్లో నిర్వాహకులు ఒకరి పేరుమీద మరొకరు నిర్వహిస్తున్నారని విషయాలను గుర్తించారు. పలు చోట్ల సిటిజన్ చార్ట్ లేకపోవడంతో ఆయన మండిపడ్డారు. అనంతరం ఆయా కేంద్రాల నిర్వహణపై ఉన్నత స్థాయి అధికారులకు నివేదిక పంపుతామని డీఎల్‌డీఓ తెలిపారు.

జగన్ పాలన దేశానికే ఆదర్శం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

వజ్రకరూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శమని సర్పంచు కె.సురేంద్ర, గ్రామ సచివాలయ కన్వీనర్ కె.పార్వతి అన్నారు. శుక్రవారం మండలంలోని గడేహోతూరు గ్రామంలో నూతన పింఛన్‌దారులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు తిమ్మారెడ్డి, పరమేష్, కరిబసి, నాగరాజు, గ్రామ కార్యదర్శి సుభాన్‌జీ తదితరులు పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలను పూజిద్దాం

- రసాయనాలతో పర్యావరణానికి ముప్పు
- వినాయక చవితికి విస్తృత ఏర్పాట్లు
- గణనాథ విగ్రహాలకు తుది మెరుగులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న పోలీసులు



వినాయక చవితి వేడుకలకు సిద్ధమవుతున్న గణనాథుడి ప్రతిమలు

రాయదుర్గం: తొలి పూజకు గణనాథులు సిద్ధమౌతున్నారు. పందిళ్లు వేసి విఘ్నాలకు అధిపతి విఘ్నేశ్వరునికి చవితి రోజు నుంచి నవరాత్రులు నిర్వహించేలా కార్యచరణ చేపట్టారు. ఈ నెల 18 నుంచి వినాయక చవితి ఉత్సవాలకు పల్లె, పట్టణాలు ముస్తాబవుతున్నాయి. పలు ప్రాంతాల్లో ఉత్సవ కమిటీల నిర్వాహకులు సంబంధిత ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. భారీ విగ్రహాల ఏర్పాటుకు వేదికలను సిద్ధం చేసే పనిలో బిజీ అయ్యారు. మరోపక్క నిబంధనల ప్రకారం జరిగేలా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో సుమారు వెయ్యికి పైగా చవితి పందిళ్లు ఏర్పాటు చేయొచ్చని పోలీసుల అంచనా. ఉత్సవాలు మొదలైన నాటి నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకూ ఎలాంటి అపశ్రుతులు దొర్లకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లకు పోలీసులు ప్రణాళికలు చేపట్టారు.

కమిటీలే కీలకం..

గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో కమిటీలే కీలకం. నిర్వాహక కమిటీల సభ్యులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఉత్సవాల్లో ఎటువంటి వివాదాలు తలెత్తకుండా.. ప్రశాంతంగా జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. ప్రధానంగా పందిళ్లు విద్యుత్తు తీగలకు తగలకుండా చూడాలన్నారు. పోలీసుల అనుమతులు తీసుకున్నాకే లౌడ్ స్పీకర్ పెట్టాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పక్కగా ఏర్పాటు చేసుకోవాలన్నారు.

మట్టి వినాయక విగ్రహాలే మేలు

రంగులతో కూడిన భారీ విగ్రహాలతో పర్యావరణానికి హాని కలుగుతుంది. మట్టితో చేసిన ప్రతిమలకు పూజచేసి నిమజ్జనం చేస్తే పర్యావరణానికి మేలు కలగడంతో పాటు గణపతికి సంప్రదాయంగా పూజలు చేసినట్లవుతుందని పెద్దలు చెపుతున్నారు. పూర్వం చెరువుల నుంచి మట్టిని తెచ్చి విగ్రహాలను తయారు చేసేవారు. తద్వారా చెరువుల్లో కొంత మేరకు పూడికతీత జరిగేది. పూజల తర్వాత విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేసేవారు. ఈ విధానం ద్వారా క్రిమి కీటకాలు కూడా నశించేవి. రాయదుర్గం పట్టణంలోని ఏవీఆర్ పాఠశాల విద్యార్థులు మట్టితో ప్రతిమ చేపట్టి ఆదర్శంగా నిలిచారు.

పీఓపీ విగ్రహాలతో నష్టాలే అధికం..

పీఓపీ (ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్) విగ్రహాలు నీటిలో కరిగేందుకు ఎక్కువ సమయం పడుతుంది. ఆకర్షణ కోసం ప్రమాదకర రసాయనాలు, రంగులు వాడటంతో నీరు కలుషితం అవుతుంది. రసాయనాల కారణంగా నీటిలో జీవరాశులు చనిపోతాయి. ఆ నీటిని తాగిన మూగజీవాలు అనారోగ్యం బారిన పడే ప్రమాదముంది.

రాయదుర్గంలో హిందూ మహాగణపతి ఉత్సవాలు

రాయదుర్గం పట్టణం జూనియర్ కళాశాల మైదానం వేడుకలకు ముస్తాబైంది. హిందూ మహాగణపతి విగ్రహ ఆవిష్కరణకు ఏర్పాట్లు సాగుతున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా భారీ వ్యయంతో ఉత్సవాలకు కమిటీ సభ్యులు సమయత్తమయ్యారు. బళ్లారి, బెంగళూరు నుంచి తెప్పించిన సామగ్రితో ప్రత్యేక మంటపాలు ఏర్పాటుకు కసరత్తు మొదలు పెట్టారు. రాయదుర్గం చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా 13 అడుగుల విగ్రహం, 11 రోజుల పాటు పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, పౌరాణిక నృత్యాలతో పాటు నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహించేలా చర్యలు చేపట్టారు.

పర్యావరణాన్ని కాపాడుదాం



మట్టి ప్రతిమలు ఏర్పాటు చేసి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం. హిందూ సంప్రదాయంలో మట్టి, చెట్ల నుంచి సేకరించిన వస్తువులకు అధిక ప్రాధాన్యం ఉంది. ఇవి లేకుండా ఏ శుభకార్యం జరగదు. ఆధునిక పోకడలతో అసలుకే మోసం వస్తుంది. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మట్టి ప్రతిమలు ఏర్పాటు చేసేలా అవగాహన చర్యలు చేపట్టాం. ప్రజలంతా ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలి.

– కాపు భారతి, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ చైర్‌పర్సన్

అనుమతి పొందాలి



వినాయక చవితి పందిళ్లలో విగ్రహాల ఏర్పాటు చేయడానికి పోలీసుల అనుమతి ముందస్తుగా తీసుకోవాలి. మట్టి విగ్రహాలకు ప్రాధాన్యం ఇస్తూ, నిబంధనలకు అనుగుణంగా ఉత్సవాలు నిర్వహించాలి. మంటపాల వద్ద ఎటువంటి అశ్లీల కార్యక్రమాలు చేపట్టరాదు. చవితి, మారెమ్మ పండుగలు కలసి రావడంతో ప్రజలంతా ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలి.

– టీ శ్రీనివాసులు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

అప్రమత్తతే శ్రీరామ రక్ష



గణనాథులకు మండలపాలకు తరలించే క్రమంలో విద్యుత్ వైర్లకు తగలకుండా జాగ్రత్తలను తీసుకోవాలి. వాహనాలపై నుంచి విగ్రహాలను జాగ్రత్తగా దించి మండపంలో ప్రతిష్టించాలి. మండపాల వద్ద విద్యుత్ వైరింగ్ సక్రమంగా ఉండాలి. అలాగే నిమజ్జనానికి గణనాథులను జాగ్రత్తగా వాహనంపైకి ఎక్కించాలి. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ చిన్నారులను నిమజ్జనానికి వెళ్లకుండా జాగ్రత్తగా చూసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా ప్రవహించిన వారిపై చర్యలు తీసుకుంటాం.

–జి.శివ, ఎస్‌ఐ, బొమ్మనహాళ్

నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న అర్బన్ సీఐ లక్ష్మణ్

రాయదుర్గంటౌన్: వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని మండపాల నుంచి నిమజ్జనం దాకా నిబంధనలు పాటించాలని ఉత్సవ కమిటీ నిర్వాహకులకు సీఐ లక్ష్మణ్, కమిషనర్ దివాకర్ రెడ్డి, తహసీల్దార్ మారుతి సూచించారు. శుక్రవారం సాయంత్రం మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షతన ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఉత్సవ నిర్వహణ, నిమజ్జనం తదితర విషయాలపై సీఐ లక్ష్మణ్ నియమ నిబంధనలు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వలిబాషా, కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, శ్రీలక్ష్మీ, శ్రీనివాసరెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ బాలు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

కణేకల్లు: మండలంలోని యర్రగుంట గ్రామంలో శనివారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి శుక్రవారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు విప్ కాపు రామచంద్రారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

పశువులకు టీకాలు

బొమ్మనహాళ్: మండలంలోని నరసాపురం గ్రామంలో 150 పశువులకు గురువారం గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు వేశారు. మరో రెండు రోజుల పాటు గ్రామంలో పశువులకు టీకాలు వేస్తామని పశు వైద్యాధికారి రమేష్ తెలిపారు. బుధవారం మృతిచెందిన పశువులు గొంతు వాపు వ్యాధితోనేనని నిర్ధారణ అయిందన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే ప్రారంభం



రాయదుర్గంటౌన్: సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి



కంబదూరు: మహిళకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్/గుమ్మఘట్ట/బ్రహ్మసముద్రం/కంబదూరు/వజ్రకరూరు/శెట్టూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా తొలి రోజు శుక్రవారం వార్డు వలంటీర్లచే ఇంటింటా సర్వే ప్రారంభమైంది. వలంటీర్లు వారి పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య వివరాలు సేకరించారు. ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించి బ్రోచర్లను అందజేశారు. ఇంట్లో ఎవరైనా వైద్యం అవసరమై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా అని అడిగి తెలుసుకుని యాప్‌లో అప్‌లోడ్ చేశారు. 3,4,6, 8,9 సచివాలయాల పరిధిలోని 5,6,9,10, 4,17,11,12,13,14 వార్డుల్లో సర్వే చేశారు. పట్టణంలోని కొలిమివీధిలో శుక్రవారం వలంటీర్లు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. శనివారం ఏఎన్‌ఎంలు ఇంటింటా సర్వే చేస్తారన్నారు. ఈ నెల 30వ తేదీ వరకూ మూడు సార్లు సర్వే జరుగుతుందన్నారు. గుమ్మఘట్ట మండలంలోని గోనబావి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహమూర్తి, సర్పంచ్ రాజేష్, ఎంపీటీసీ గోవింద, గోనబావి ప్రతాప్‌రెడ్డి, కురుబ రామాంజనేయులు, సూపర్‌వైజర్ ఆదిబయమ్మ, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, ఆశావర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు. అలాగే బ్రహ్మసముద్రం మండలంలోని భైరసముద్రం గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ దాసా నాయక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, ఏఎన్ ఎమ్ , గ్రామ వాలంటీర్లు ఆశవర్కర్లతో సమవేశమై మాట్లాడారు. ఈ నెల 30న భైర సముద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కంబదూరు మండల కేంద్రంలోని ఆర్డీటీ కాలనీలో వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, ఐసీడీఎస్ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, జిల్లా కమిటీ సభ్యుడు నీలి శంకరప్ప, సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్, ఎంపీడీఓ సుధాకర్ రాజు, వైద్యాధికారి ప్రసన్నకుమార్, ఎంపీటీసీలు మీసేవ కుమార్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. వజ్రకరూరు మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలలిత, వైద్యాధికారి సర్దార్‌వలి, ఎంపీహెచ్‌ఈఓ గురుప్రసాద్,హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, సూపర్‌వైజర్లు సుశీల, నాగశంకర్, గ్రామ కార్యదర్శి శ్రీధర్‌రావు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు. శెట్టూరు మండలంలోని చిన్నంపల్లిలో జగనన్న సురక్ష సర్వేను వలంటీర్లతో కలిసి అధికారులు ప్రారంభించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురామరావు, డాక్టర్ వేణు కార్తీకేయ, సీహెచ్‌ఓ సరోజమ్మ, సూపర్‌వైజర్ లీలావతి, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



కళ్యాణదుర్గం: క్రీడాకారులతో అతిథులు



రాయదుర్గంటౌన్: జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో అధికారులు

కళ్యాణదుర్గం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీపీ మారుతమ్మ సూచించారు. స్థానిక కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఎంపీపీ, స్థానిక ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఎంపీడీఓ సాలమ్మ్, జేసీఎస్ కన్వీనర్ ఆంజనేయులు మాట్లాడారు. 8 క్రీడాంశాలు, 12 వ్యక్తిగత క్రీడల్లో బాలికలు పోటీలు పడ్డారు. వివిధ మండలాల నుంచి సుమారు 475 మంది బాలికలు పోటీలకు హాజరైనట్లు క్రీడల కో ఆర్డినేటర్ చల్లా రాజశేఖర్ చౌదరి తెలిపారు.


రాయదుర్గంటౌన్: చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమని ఎంఈఓలు నాగమణి, వెంకటరమేష్ అన్నారు. మండలంలోని పల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండోరోజు శుక్రవారం స్కూల్ గేమ్స్ ఉత్సాహంగా, ఉల్లాసంగా కొనసాగాయి. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి విచ్చేసిన వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన క్రీడాకారులకు (అండర్- 14, అండర్-17 బాలబాలికలకు) వాలీబాల్, టెన్నీకాయిట్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనుబరిచిన క్రీడాకారులను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాగరాజురెడ్డి, ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ కోఆర్డినేటర్ నాగేంద్ర, కార్యదర్శి సుధాకర్, పీడీలు శివశరణప్ప, రామాంజనేయులు, భోగేష్, ఇస్మాయిల్, జయప్ప, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు సూచించారు. మండలంలోని దేవగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు బాల్ బ్యాట్మింటన్ నియెజకవర్గ క్రీడా పోటీల్లో ప్రతిభ కనభరచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందలు తెలిపారు. అండర్-14లో శాంతి, స్నేహ, అశ్విని, రామ్‌చరణ్, జీవన్, లోకచరణ్ ప్రేమ, అండర్-17లో మేఘన, ఉలిగమ్మ, అంజలి, సువర్ణ, కీర్తన, చరణ్‌కుమార్, అనీల్‌కుమార్, నరేంద్ర, గిరి, సంతోష్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో పీఈటీ రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రెయిన్‌గన్స్ వినియోగంపై ఏఓ విచారణ

వజ్రకరూరు: మండలంలోని కమలపాడు, గడేహోతురు గ్రామాల్లో పంట సంజీవని పథకంలో భాగంగా పంపిణీ చేసిన రెయిన్‌గన్స్ వినియోగంపై శుక్రవారం ఏఓ మధుకర్ విచారణ చేపట్టారు. అనంతరం ఈ–క్రాప్ బుకింగ్ నమోదు కార్యక్రమాన్ని తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రేయిన్‌గన్స్ వినియోగంపై వివరాలు సేకరించి, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. అలాగే రాయితీతో అందజేసే ప్రత్యామ్నాయ పంట విత్తనాలు పెసలు, అలసందులు, ఉలవలను రైతులు సద్వి నియోగం చేసుకోవాలన్నారు. ఈ–క్రాప్ నమోదుకు ఈ నెల 30 వరకూ గడువు పొడగించారన్నారు. అలాగే వెంకటాంపల్లిలో పంటనమోదు కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయ ఏఓలు శంకర్‌లాల్ నాయక్, సాయిలక్ష్మి తదితరులు తనిఖీ నిర్వహించారు. ఏఈఓ ప్రసాద్, సిబ్బంది రామక్రిష్ణ నాయక్, డాకునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు



కళ్యాణదుర్గంలో అధ్యాపకుడు మల్లప్పను సన్మానిస్తున్న దృశ్యం

కణేకల్లు: టీచర్స్ డే సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న మల్లెల మోసెస్, సుజాత దంపతులకు శుక్రవారం కణేకల్లులోని కొండారెడ్డి ప్రాథమిక పాఠశాలలో సన్మానసభ నిర్వహించారు. అలాగే మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలు ఆదిగానిపల్లి స్కూల్ హెచ్‌ఎం లక్ష్మీదేవి, పెనకలపాడు స్కూల్‌లో ఎస్‌జీ టీచర్‌గా పని చేస్తూ గ్రూప్–1లో విజయం సాధించి ఎంపీడీఓ పోస్టు సాధించిన కవిరాజును ఎంఈఓలు లక్ష్మణ్ణ, ఆర్.భవానీశంకర్, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.శేషారెడ్డి,ఉపాధ్యాయులు శాల్వ కప్పి పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు అస్లాం, ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి, ఎమ్మార్పీ వెంకటేశులు, సీఆర్‌పీ రాజేష్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: భగవత రత్న అవార్డు గ్రహీత, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు మల్లప్పను తోటి అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. స్థానిక కళాశాలలో శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తూ భగవత రత్న అవార్డు అందుకోవడం కళాశాలకు గర్వకారణంగా ఉందని ప్రిన్సిపాల్ జగన్నాథ్ అన్నారు. అనంతరం జ్ఞాపికను బహూకరించి సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జయలక్ష్మి, బాపూజీ, శ్రీనివాస్, వెంకటేష్ బాబు, ప్రభాకర్, తిప్పేస్వామి, కుంటెన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ద్విచక్ర వాహనాల వేలం

గుమ్మఘట్ట: వివిధ మద్యం కేసుల్లో పట్టుబడిన ఒక కారు, తొమ్మిది ద్వి చక్ర వాహనాలను బహిరంగ వేలం వేయగా రూ.1,07,262 ఆదాయం వచ్చినట్లు ఎస్ఐ సునీత తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ కార్యాలయ ఆవరణలో ద్విచక్రవాహనాలను శుక్రవారం బహిరంగ వేలం వేశారు. కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తరలిస్తూ పట్టుబడిన వాహనాలను జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సెబ్ సీఐ శ్రీనివాసులు సమక్షంలో వేలం వేశామన్నారు.

మౌలిక వసతులు తప్పనిసరి



పోలింగ్ కేంద్రంలో వసతులు పరిశీలిస్తున్న తహసీల్దార్

కూడేరు: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు మౌలిక వసతులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని తహసీల్దార్ శేషారెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన కూడేరు, అంతరగంగ, ఇప్పేరులోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. దివ్యాంగులు ఓటు వేసేందుకు వీలుగా ర్యాంప్ , గదుల్లో విద్యుత్, ఫ్యాన్ సౌకర్యం ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. నీటి వసతి ఉందా అని ప్రధానోపాధ్యాయులతో ఆరా తీశారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రసన్నకుమార్, వీఆర్‌ఓ ఓబులేసు, సిబ్బంది పాల్గొన్నారు.

మోటార్ల అప్పగింత

కణేకల్లు: హెచ్చెల్సీ కాలువతోపాటు డిస్ట్రిబ్యూటరీలో మోటార్లు వేసి నీటి చౌర్యం చేస్తున్న రైతుల పట్ల అధికారులు మానవతా ధృక్పథం చూపి, స్వాధీనం చేసుకున్న మోటార్లను శుక్రవారం రైతులకు అప్పగించారు. ఇటీవల అధికారులు 28 మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. మరోసారి జల చౌర్యం చేయమని నాన్ ఆయకట్టుదారులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. దీంతో కణేకల్లు హెచ్చెల్సీ సబ్ డివిజన్ డీఈఈ మద్దిలేటి, ఏఈఈ అల్తాఫ్ తమ ఆధీనంలో ఉన్న 28 మోటార్లను రైతులకు వెనక్కి ఇచ్చారు. మరోమారు జలచౌర్యం చేస్తే సహించేది లేదని మోటార్లను స్వాధీనం చేసుకుని వేలం వేస్తామని అధికారులు హెచ్చరించారు.

క్వాలిటీ కంట్రోల్ అధికారుల పర్యటన

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం క్వాలిటీకంట్రోల్ అధికారులు పర్యటించారు. గంజికుంట, తట్రకల్లు, రాగులపాడు గ్రామాల్లో నిర్మించిన రోడ్లను వారు పరిశీలించి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఈఈ మల్లికార్జున మూర్తి, డీఈలు భరత్‌ప్రకాష్‌రెడ్డి, అరుణ్‌కుమార్, జేఈలు నళిని, మణిభూషణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు అవకాశం

కంబదూరు: పదో తరగతి, ఇంటర్ ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని కంబదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, ఉపాధ్యాయుడు డెగావత్ రవీంద్రనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి పది, ఇంటర్ ఓపెన్ ప్రవేశాలకు అర్హులైన వారు ఈ నెల 25లోపు అడ్మిషన్ పొందాలన్నారు. వివరాలకు 9491988836 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నివాళి

కంబదూరు: వైఎస్సార్‌సీపీ సీనియర్ దళిత నేత సీహెచ్ నరసప్ప వర్ధంతి కార్యక్రమం శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించారు.ఈ సందర్భంగా నరసప్ప చిత్రపటానికి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళితులు, వైఎస్సార్‌సీపీకి ఆయన చేసి సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లేష్, నాయకులు లింగమూర్తి, శివప్రసాద్, గోపి, రాజు, కిరణ్, మల్లికార్జున, హనుమంతరాయుడు, కుటుంబ సభ్యులు రామస్వామి, అశోక్, చక్రవర్తి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘ సభ్యులకు అవగాహన

కళ్యాణదుర్గం రూరల్: సహకార సంఘం సభ్యులు, రైతులకు శుక్రవారం కళ్యాణదుర్గంలోని ఏడీసీసీ బ్యాంక్‌లో ఐసీఎం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సహకార అధికారి ప్రభాకర్‌రెడ్డి, హైదరాబాద్‌కు చెందిన ఐసీఎం ప్రొఫెసర్ శ్రీనివాసులు హాజరయ్యారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ తేజస్విణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే

ఉరవకొండ: స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో అంతర్జాతీయ ఇంజినీర్స్ డేను పురస్కరించుకుని శుక్రవారం ఇంజినీర్లను సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జయచంద్ర మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్మరించుకోవాలన్నారు. ఈసందర్భంగా సీనియర్ పీఆర్ ఇంజినీర్ వెంకటేసులు, లక్ష్మీనారాయణ, మిడతల విశ్వనాథ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు సప్తగిరి మల్లి, నాగేశ్వరావు, శ్రీధర్, గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి:మండలంలోని ఎస్కే చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంతో పాటు స్థానిక ప్రభుత్వ కళాశాలలో శుక్రవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ట్రస్టు వ్యవస్థాపకుడు లెనిన్‌బాబు, ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

రాయదుర్గంటౌన్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ హరిగోపాల్ డిమాండ్ చేశారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శుక్రవారం రాయదుర్గం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన దీక్ష ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పెన్నప్ప, శీన, తిప్పేస్వామి, ప్రకాష్, మల్లేష్, మహేష్ పాల్గొన్నారు.